సాక్షి
ఆదిలాబాద్

సోమవారం । 24 । జూన్ । 2024



పోరుబాటలో ఆదివాసీలు
'పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప' అనే నానుడిని పునికి పుచ్చుకున్న ఆదివాసీలు పోరుబాటకు సై అంటున్నారు. 8లో▸



కలగానే టూరిజం..!
ఏజెన్సీలో పేరుగాంచిన మత్తడి చెరువు పర్యాటకుల మదిని దోచుకుంటున్నా.. నిర్లక్ష్యానికి గురవుతోంది. అధికసంఖ్యలో వస్తున్న పర్యాటకులకు సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0/27.0

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న జడ్జి దంపతులు

జైనథ్: మండల కేంద్రంలోని అతి ప్రాచీన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం జిల్లా జడ్జి కే.ప్రభాకర్‌రావ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జడ్జి దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాశస్త్యం, విశిష్టతను గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు.

గిరిజన విద్యార్థికి దార్వాడ్ ఐఐటీలో సీటు



పవార్ చంటి

ఇచ్చోడ: నేరడిగొండ మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన పేదింటి గిరిజన విద్యార్థి పవార్ చంటి కర్ణాటక రాష్ట్రంలోని దార్వాడ్ ఐఐటీలో సీటు సాధించాడు. పదోతరగతి వరకు నిర్మల్ జిల్లాలోని డ్యాంగపూర్‌లో ఇంటర్ ఇచ్చోడలోని గిరిజన గురుకుల కళాశాలలో పూర్తి చేశాడు. ఇటీవల వెలువడిన మొదటి రౌండ్ ఫలితాల్లో దార్వాడ్ ఐఐటీలో సీఎస్సీలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని విద్యార్థి చంటి నిరూపించాడన్నారు.

టీచర్లు బడిలోనే ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉదయం ప్రార్థన సమయం నుంచి సాయంత్రం సెలవు అయ్యేంత వరకు బడిలోనే ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత పనులపై ఎవరూ బయటకు వెళ్ల వద్దన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు. నిబంధనలు పాటించని ఉపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

నేటి నుంచి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలు

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆన్‌లైన్ పరీక్షలు నేటి నుంచి ఈ నెల 29 వరకు జరుగనున్నాయి. పట్టణ శివారులోని నలంద డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వెయ్యి మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానుండగా ప్రతీరోజు ఉదయం 100, మధ్యాహ్నం 100 మంది చొప్పున పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. అభ్యర్థులు గంట ముందేగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు తీసుకురావద్దని అధికారులు సూచించారు. పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

'ఏఎన్‌ఎం పోస్టులు భర్తీ చేయాలి'



వినతిపత్రం ఇస్తున్న అభ్యర్థిని

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్: ఏఎన్‌ఎం పోస్టులు భర్తీ చేసేలా చూడాలని అభ్యర్థులు ఆదివారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 నవంబర్‌లో గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 1,931 పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ చేసిందని, ఎన్నికల కోడ్ రావడంతో పరీక్ష నిర్వహించలేదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఉమాదేవి, ప్రమీల, లావణ్య, గీత, శ్రీలేఖ, సతీష్ యాదవ్ పాల్గొన్నారు.

బడిబాట అంతంతే..

- పూర్తిస్థాయిలో పాఠశాలల్లో చేరని విద్యార్థులు
- డ్రాపౌట్లను చేర్పించడంలో అలసత్వం
- ప్రైవేట్, గురుకులాల బాట పట్టిన చిన్నారులు

బడిబాట వివరాలు..
1వ తరగతిలో చేరాల్సిన విద్యార్థులు : 7,507
చేరిన విద్యార్థులు : 5,011
6వ తరగతిలో చేరాల్సిన విద్యార్థులు : 6,272
చేరిన విద్యార్థులు : 5,092
8వ తరగతిలో చేరాల్సిన విద్యార్థులు : 6,678
చేరిన విద్యార్థులు : 6,195
జిల్లాలో మొత్తం విద్యార్థులు : 65,522



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడులను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పిస్తోంది. పిల్లలకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాంలు పంపిణీ చేస్తోంది. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే దిశగా కార్యక్రమం నిర్వహించినప్పటికీ సఫలమయ్యేలా కనిపించడం లేదు. చాలా మంది ఉపాధ్యాయులు నామ్‌కే వాస్తే కార్యక్రమాన్ని నిర్వహించి చేతులు దులుపుకున్నారు. సంబంధిత అంగన్‌వాడీలో ఉన్న పిల్లలను పూర్తిస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ అమలు కాలేదు. జిల్లాలోని 1,256 అంగన్‌వాడీ కేంద్రాల్లో 7,507 మంది చిన్నారులు ఉన్నట్లు ఐసీడీఎస్ అధికారులు నివేదిక ఇచ్చారు. అయితే బడిబాటలో భాగంగా ఇప్పటి వరకు 5,011 మంది చిన్నారులు ఒకటో తరగతిలో చేరినట్లు లెక్కలు చెబుతున్నారు. ఈ లెక్కలకు పొంతన లేకుండా పోయింది. ఇంకా 2,496 మంది పిల్లలు ఏ పాఠశాలల్లో చేరారనే వివరాలు వారి వద్ద లేవు. అయితే వారు ఇచ్చిన వివరాలు తప్పుల తడకగా ఉన్నట్లు తెలుస్తోంది. సర్కారు బడుల్లో ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఆరో తరగతిలో, ఎనిమిదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఆపై తరగతుల్లో చేర్పించాల్సి ఉండగా వారి లెక్కలకు సరితూగడం లేదు. అయితే ఈ నెల 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రాపౌట్ పిల్లలను సైతం బడిలో చేర్పించాల్సి ఉండగా వారి వద్ద ఎంత మందిని చేర్పించారనే వివరాలు లేకపోవడం గమనార్హం.

ప్రణాళికకే పరిమితం..
బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. రోజువారీ ఏ కార్యక్రమాలు నిర్వహించాలనే అంశాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. అయితే చాలా మంది ఉపాధ్యాయులు ప్రణాళికను అమలు చేయలేదు. ఏదో ఒక ఇంటికి వెళ్లి ఫొటోలు దిగి గ్రూప్‌లో పోస్టు చేయడం తప్పా పకడ్బందీగా చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల్లో విద్యార్థులు ప్రైవేటు స్కూల్ బాట పట్టారు. జిల్లాలో 1,256 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో 7,507 మంది ఐదేళ్లు పూర్తయిన వారు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నారు. ఇప్పటి వరకు ఒకటో తరగతిలో 5,011 మంది మాత్రమే సర్కారు బడుల్లో చేరారు. 2,496 మంది చిన్నారులు ఏ పాఠశాలల్లో చేరారనే వివరాలు లేవు. సర్కారు బడుల్లో ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు జిల్లాలో 6,272 మంది ఉండగా ఆరో తరగతిలో 5,092 మంది విద్యార్థులు చేరారు. మిగితా 1,180 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో చేరినట్లు తెలుస్తోంది. అయితే వీరు ఏ పాఠశాలల్లో ఎంత మంది చేరారనే వివరాలు మాత్రం లేవు. అదే విధంగా ఏడో తరగతి పూర్తి చేసి ఎనిమిదో తరగతిలో చేరే విద్యార్థులు 6,678 మంది ఉండగా 6,195 మంది మాత్రమే చేరారు. మిగతా 483 మంది విద్యార్థుల వివరాలు లేవు.

డ్రాపౌట్ పిల్లల సంగతేంటి?

బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశం చదువు మధ్యలో మానేసిన వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడం. అయితే జిల్లాలో పాఠశాలలు తెరవక ముందే సీఆర్పీలు బడిబయట ఉన్న పిల్లల వివరాలు సేకరించారు. 6 నుంచి 14 సంవత్సరాల వారు జిల్లాలో 563 మంది ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా 15 నుంచి 19 సంవత్సరాల వరకు 121 మంది ఉన్నారు. వీరిని వారి వయస్సును బట్టి తరగతిలో చేర్పించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు డ్రాపౌట్ పిల్లల్ని ఎంత మందిని బడిలో చేర్పించారనే వివరాలు విద్యాశాఖ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. కాకి లెక్కలు చెబుతూ దాటవేసే ధోరణితో వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేజీబీవీల్లో డ్రాపౌట్ పిల్లల్ని, ఆర్ఫాన్, సెమీ ఆర్ఫాన్ పిల్లల్ని మాత్రమే చేర్పించాల్సి ఉంటుంది. అయితే ఆయా గ్రామాల్లో ఉన్న బాలికలను ఈ పాఠశాలల్లో చేర్పించడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది.

బడిబాట పకడ్బందీగా నిర్వహించాం



జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాం. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి సర్కారు బడుల్లో పిల్లల్ని చేర్పించే దిశగా చర్యలు చేపట్టారు. ఒకటో తరగతిలో 5,011 మంది విద్యార్థులు, ఆరో తరగతిలో 5,092 మంది, ఎనిమిదో తరగతిలో 6,195 మంది విద్యార్థులు చేరారు. ఈనెల చివరి వరకు ప్రవేశాలు జరుగుతాయి. విద్యార్థుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. **– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్**

రైల్వే, రోడ్లకు తొలి ప్రాధాన్యత

- విద్య, వైద్య సౌకర్యాల మెరుగుకు ప్రత్యేక కృషి
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎంపీ గోడం నగేశ్



గోడం నగేశ్

కైలాస్‌నగర్: తనపై నమ్మకంతో గెలిపించిన పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేలా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రెండోసారి ఎంపీగా విజయం సాధించిన ఆయన సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో 'సాక్షి' ఆయన్ను పలకరించగా ఈ ఐదేళ్ల పదవీ కాలంలో రైల్వే రంగంలో పెండింగ్ సమస్యలతో పాటు ప్రధాన రోడ్లను జాతీయ రహదారులుగా మార్చేలా తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. విద్య, వైద్యపరంగానూ పేదలకు భరోసా కల్పించడంతో పాటు కేంద్రం నుంచి వీలైనన్ని అధిక నిధులు తెచ్చేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.

సాక్షి: ఆదిలాబాద్ ఎంపీగా మీ ప్రాధాన్యతలు ఏంటి?

ఎంపీ: రైల్వేరంగ సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యతాంశంగా పనిచేస్తా. జిల్లా కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న ఆర్‌యూబీ, ఆర్‌వోబీలను పూర్తి చేయించేందుకు కృషి చేస్తా. ఈ ప్రాంత ప్రజల చిరకాల కల అయిన ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు కొత్తగా రైల్వేలైన్ ఏర్పాటుకు అవసరమైన నిధులు విడుదల చేయిస్తా. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని పలు ఆర్‌అండ్‌బీ పెద్ద రోడ్లను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేసేలా కృషి చేస్తా. మారుమూల గ్రామాలకు సైతం రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తా.

సాక్షి: విద్య, వైద్య పరంగా ఎలాంటి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తారు?

ఎంపీ: పేదల ఆరోగ్యానికి భరోసానిచ్చేలా వైద్య సేవలు మరింత మెరుగుపరిచేలా కృషి చేస్తా. పార్లమెంట్ పరిధిలో మరో నవోదయ విద్యాలయంతో పాటు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తా. విద్య, వైద్యం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ప్రజలకు లబ్ధిచేకూర్చేందుకు ప్రయత్నిస్తా.

సాక్షి: ఎంపీగా, మంత్రిగా సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మీపై జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాటిని ఏ విధంగా నెరవేరుస్తారు.

ఎంపీ: కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలన్నింటినీ పార్లమెంట్ పరిధిలోని వాసులకు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధవహిస్తా. ఈ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన కేంద్రపరమైన అంశాలను ప్రధాని నరేంద్రమోదీతో పాటు సంబంధిత శాఖల మంత్రులను కలిసి ప్రత్యేక నిధులు విడుదలయ్యేలా ప్రయత్నిస్తా.

సాక్షి: ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ (సీసీఐ) పునఃప్రారంభానికి ఎలాంటి కృషి చేయనున్నారు?

ఎంపీ: అదో పెద్ద సమస్య. దానిపై ఇప్పుడే ఏం మాట్లాడలేను. కేంద్ర ప్రభుత్వపరంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించి దానిపై దృష్టి సారిస్తా.

సాక్షి: జిల్లా కేంద్రంలో ఎయిర్‌ఫోర్స్ ట్రైనింగ్ సెంటర్, ఎయిర్‌పోర్టు ఏర్పాటు అంశం సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. మీ హయాంలో అది సాకారమయ్యే అవకాశం ఉందా?

ఎంపీ: జిల్లా కేంద్రంలో రక్షణశాఖకు సంబంధించి 369 ఎకరాల భూమి ఉంది. మరో 1500 ఎకరాల భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలను అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా ఎన్‌వోసీ ఇవ్వలేదు. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై సుముఖంగా ఉన్నందున ఎన్‌వోసీ వచ్చే అవకాశముంది. కేంద్ర విమానయాన శాఖ మంత్రితో సత్సంబంధాలు ఉన్నందున ఈ విషయాన్ని ఆయన, ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లి ఎలాగైనా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు చేయిస్తా.


పాలిసెట్ కౌన్సెలింగ్ షురూ



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం ఇటీవల నిర్వహించిన పాలిసెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. మరో రెండు రోజుల పాటు మొదటి విడత ఈ కౌన్సెలింగ్ జరగనుందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ భరద్వాజ తెలిపారు. మొత్తం 145 మందికి గానూ 129 మంది సర్టిఫికెట్లు పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ రాజ్‌కుమార్, సిస్టమ్ అనాలిస్ట్ సుజయ్, లెక్చరర్లు శ్రీనివాస్, క్రాంతికుమార్, ప్రవీణ్, సురేష్, హేమలత, రవికుమార్ పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నగేశ్

ఎదులాపురం: దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో జూలైలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు మేస్రం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వేదిక జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగుల సమస్యలపై ఆయా జిల్లాల కలెక్టర్లకు పలుమార్లు వినతి పత్రాలు అందించినా పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను పెడచెవిన పెట్టిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు, వందశాతం సబ్సిడీ రుణాలు అందించాలని, రిజెక్ట్ అయిన సదరం సర్టిఫికెట్లను రెన్యూవల్ చేయాలని, చదువుకున్న దివ్యాంగులకు బ్లాక్ లాగ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లలో 5 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పోచన్న, ప్రవీణ్, సత్యనారాయణ, యోగేష్, ఇమ్రాన్, అనసూయ, బుచ్చక్క, మోహన్‌బాబు, మసూద్ పాల్గొన్నారు.

చిత్రకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న తాళ్లపల్లి రాజేశ్వర్

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చిత్రకారులను గుర్తించి ఆదుకోవాలని తెలంగాణ ఆర్టిస్టుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టిస్టుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కుటుంబాలకు ఉచిత వైద్యం, బీమా సౌకర్యం, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సంఘ బాధ్యులు సత్యనారాయణ, రాజనాథ్, బాలకృష్ణ, యాదవ్‌రావు, యాదగిరి, తేజ, ప్రకాష్, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ లేనట్టేనా?

- ఏటా జూన్ మొదటి వారంలోగా టెండర్ల ప్రక్రియ పూర్తి
- ఈ ఏడాది ఇంకా మొదలుకాని కసరత్తు
- కరువైన ప్రభుత్వ స్పష్టత
- మత్స్యకారుల్లో ఆందోళన

జిల్లా వివరాలు
మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు : 95
సహకార సంఘాల్లోని సభ్యులు : 4,490
రిజర్వాయర్లు : 08
మొత్తం చెరువులు : 232



మత్తడివాగు ప్రాజెక్ట్‌లో చేప సీడ్‌ను వదులుతున్న మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు (ఫైల్)

కైలాస్‌నగర్: కులవృత్తిపై ఆధారపడి జీవించే మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంచాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెరువుల్లో ఉచితంగా చేప పిల్లల పంపిణీ ప్రక్రియను చేపట్టింది. 2016లో కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా ఏటా జూన్ మొదటి వారంలోగా జిల్లాస్థాయిలో చేప పిల్లల సీడ్ సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేసేది. వర్షాలు సమృద్ధిగా కురిసిన కొద్దీ జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల వారీగా సీడ్‌ను వేసేవారు. కానీ ఈ ఏడాది జూన్ మాసం పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో జిల్లా మత్స్యశాఖలో దీనిపై ఎలాంటి కదలిక లేదు. ఫలితంగా ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీ లేనట్టే కనిపిస్తోంది. దీనిపై మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

గతేడాది 1.18 కోట్ల చేప పిల్లల పంపిణీ
2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 216 చెరువులు, ఎనిమిది రిజర్వాయర్లలో రూ.90 లక్షలు వెచ్చించి 1,18,34,000 చేప పిల్లల సీడ్‌ను వదిలారు. కజ్జర్ల, అందర్‌బంద్, ఉట్నూర్ పెద్ద చెరువులతో పాటు లక్ష్మింపూర్ రిజర్వాయర్, దేగామ, కరత్వాడ, సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్ట్‌ల్లో 80 నుంచి 100 మిల్లీ మీటర్ల సైజ్ గల 32.70 లక్షల చేప పిల్లలను వదిలారు. 216 చెరువుల్లో 35 నుంచి 40 మిల్లీ మీటర్ల సైజు గల 85,63,980 చేప పిల్లల సీడ్‌ను వదిలారు. కట్ల, రాహు, బంగారు తీగ, మృగాల వంటి నాలుగు రకాల చేప పిల్లల సీడ్‌ను పంపిణీ చేశారు. ఇందుకు సంబంధించి అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు మే నెలలోనే టెండర్ల ప్రక్రియ మొదలుపెట్టిన జిల్లా మత్స్య శాఖ అధికారులు జూన్ మొదటి వారంలో పూర్తి చేశారు. ముగ్గురు కాంట్రాక్టర్లు దరఖాస్తు చేయగా నిర్మల్ జిల్లాకు చెందిన కాంట్రాక్టర్‌కు సీడ్ సరఫరా బాధ్యతలు అప్పగించారు. గతేడాది వర్షాలు ఆలస్యంగా రావడంతో సెప్టెంబర్ 5న చేప పిల్లల పంపిణీని ప్రారంభించి ఆ నెలాఖరు వరకు పూర్తి చేశారు.

ఈ ఏడాది ఇంకా మొదలుకాని కసరత్తు
ఈ ఏడాది ఉచిత చేప పిల్లల సీడ్ పంపిణీ ఉంటుందా లేదా అని మత్స్యకారుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంపిణీ చేస్తామని కానీ, చేయలేమంటూ కానీ ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయలేదు. అయితే జిల్లా స్థాయిలో ఏటా సీడ్ సరఫరాకు జూన్ రెండో వారంలోనే టెండర్ల ప్రక్రియ ముగుస్తుంది. కానీ ఈ సారి జూన్ నెల ముగింపు దశకు చేరుకుంటున్నా టెండర్లపై జిల్లా మత్స్యశాఖలో ఎలాంటి కదలిక లేదు. ఫలితంగా ఈ సారి చేప పిల్లలు చెరువుకు చేరడం అనుమానమేనని మత్స్యశాఖ ఉద్యోగులతో పాటు మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంపై మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసి తమను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

ఎలాంటి ఆదేశాలు రాలేదు

ఉచిత చేప సీడ్ సరఫరాకు సంబంధించి ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఆదేశాలు అందలేదు. సరఫరా చేస్తారా? లేదా? అనేదానిపై ఉన్నతాధికారుల నుంచి కూడా ఎలాంటి సమాచారం లేదు. గతేడాది ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాం. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో ఈ ఏడాది అనుమానంగానే అనిపిస్తోంది. అయితే ఈ ఏడాదికి సంబంధించి చెరువుల్లో వేయాల్సిన చేప పిల్లల సీడ్ ప్రణాళికను సిద్ధం చేసి ఉంచాం. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే వాటి ప్రకారం ముందుకెళ్తాం.

– వై.సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

20 మంది పోలీసులకు సేవా పతకాలు

ఆదిలాబాద్‌టౌన్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీసులకు ప్రభుత్వం సేవా పతకాలు ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతకాలను అందించనుంది. జిల్లాలో 20 మంది పోలీసు అధికారులకు పతకాలు లభించాయి. ఒకరు ఉత్తమ సేవా పతకం, 19 మంది సేవా పతకాలు అందుకోనున్నారని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు.

ఉత్తమ సేవా పతకం..
పీ.యువరాజ్, ఏఆర్ ఎస్సై

సేవా పతకాలు..
జీవీ.రమణారెడ్డి, ఎస్సై, బోథ్
శివరాం, ఎస్సై, తాంసి
ఎస్.ముకుంద్‌రావు, ఏఎస్సై, ఉట్నూర్
కె.రమేశ్, ఏఎస్సై, నేరడిగొండ
కె.భీంరావు, ఏఎస్సై, ఇంద్రవెల్లి
ఆర్.ఆత్మారాం, ఏఎస్సై, మహిళా పోలీస్ స్టేషన్, ఆదిలాబాద్
ఆర్.బలిరాం, ఏఎస్సై, గుడిహత్నూర్
ఆర్.గణపతి, ఏఎస్సై, భీంపూర్
వెంకటమ్మ, ఏఎస్సై, వన్‌టౌన్
ఎం.విజయలక్ష్మి, ఏఎస్సై, టూటౌన్
ఎన్.పోశెట్టి, ఏఆర్ ఎస్సై, ఆదిలాబాద్
ఎస్.లక్ష్మణ్, ఏఆర్ ఎస్సై, ఆదిలాబాద్
గణపతి, హెడ్ కానిస్టేబుల్, తాంసి
కె.వెంకట్‌రావు, హెడ్ కానిస్టేబుల్, జైనథ్
ఎస్.రాజన్న, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్
ఎండీ జాఫరొద్దీన్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్
షేక్ అమీర్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్
జె.దేవిదాస్, కానిస్టేబుల్, ఇంద్రవెల్లి
బీ.సురేష్, ఏఆర్ ఎస్సై, ఆదిలాబాద్

ఇంటెలిజెన్స్ విభాగంలో..
బదాల అశోక్ రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్
ఆకుల కిష్టు, హెడ్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్
తుడుం పోశెట్టి, హెడ్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్

క్లుప్తంగా

నిర్మల్‌లో కుక్కల బీభత్సం



కుక్కల దాడిలో గాయపడ్డ యువకుడు

నిర్మల్‌టౌన్: నిర్మల్‌లో కుక్కలు బీభత్సం సృష్టించాయి. పట్టణంలోని బంగల్‌పేట్, నాయుడివాడ కాలనీలోని సుమారు ఎనిమిది మందిపై ఆదివారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. పలువురు కాలనీవాసులు రాళ్లు, కర్రలతో కుక్కలను తరిమేశారు. గాయపడ్డవారిని వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పట్టణంలో నిత్యం ఇలాంటి ఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

ఫారెస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



శేషారాం



ముజీబోద్దీన్

జన్నారం: జన్నారం ఫారెస్ట్ అటవీ డివిజన్ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జన్నారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా బీ.శేషారాం (ఎఫ్ఎస్‌వో, దొంగపల్లి), ఉపాధ్యక్షుడిగా లాల్‌బాయ్ (బీట్ అధికారి, మహ్మదాబాద్), ప్రధాన కార్యదర్శిగా ముజీబోద్దీన్ (బీట్ అధికారి, కలమడుగు), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కృష్ణారావు (సెక్షన్ అధికారి, కవ్వాల్), సంయుక్త కార్యదర్శిగా కృష్ణమూర్తి (బీట్అధికారి, మల్యాల్), కోశాధికారిగా అనిల్ (బీట్ అధికారి, దండెపల్లి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలకు అసోసియేషన్ జోనల్ కార్యదర్శి సుభాష్, సర్కిల్ రిప్రజెంటేటివ్ అజార్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

ముత్తన్నకు 'జ్యోతిష్య భూషణ్'



అవార్డు అందుకుంటున్న ముత్తన్న

బోథ్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన బిట్లింగ్ ముత్తన్నకు జ్యోతిష్య భూషణ్ బిరుదు లభించింది. ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలోని రాడిన్సన్ బ్లూ హోటల్‌లో యూఎస్ఏకు చెందిన ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాస్తు అంశంలో ముత్తన్న చేస్తున్న సేవలకు గానూ ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డుతో పాటు, జ్యోతిష్య బిరుదుతో పాటు ఐవీఏఎఫ్ సంస్థలో జీవితకాల సభ్యత్వం లభించింది. ఐవీఏఎఫ్ ఫౌండర్ దివ్య, సంస్థ సభ్యులు అవార్డు, బిరుదును అందించినట్లు బిట్లింగ్ ముత్తన్న తెలిపారు.

పోరుబాటలో ఆదివాసీలు

- ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్
- పట్టాల కోసం పోడురైతుల ఆందోళన
- గిరిపుత్రుల గోడు పట్టించుకోని ప్రభుత్వాలు
- నిరసనలకు పిలుపునిచ్చిన తుడుందెబ్బ
- నేడు ఐటీడీఏ ఎదుట 'మహాధర్నా'



ఉట్నూర్‌లో ధర్నా చేస్తున్న నిరుద్యోగులు(ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): 'పోరాడితే పోయేదేమిలేదు.. బానిస సంకెళ్లు తప్ప' అనే నానుడిని పునికి పుచ్చుకున్న ఆదివాసీ నిరుద్యోగులు పోరుబాటకు సై అంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా తమ గోడును పట్టించుకోవడం లేదని ఆదివాసీ నిరుద్యోగులు పోరాటానికి సిద్ధమవుతున్నారు. పెద్ద చదువులు చదివి ఉద్యోగాలు లేక కుటుంబాల పోషణ భారమవుతుందని, తమకు దక్కాల్సిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని మండిపడుతున్నారు. ఇందుకు ఆందోళనలే శరణ్యమని నమ్మి ఉద్యమాల బాట పడుతున్నారు. ఆదివాసీ పోడు రైతులు సైతం ప్రభుత్వాల చర్యలతో రగిలిపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా పోడు భూములు సాగు చేస్తున్నప్పటికీ పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని పోరుబాటలో ఆదివాసీ నిరుద్యోగులతో జతకడుతున్నారు. ఇందుకోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో నేడు ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట మహాధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చారు. గడిచిన వారం రోజులుగా ఆదివాసీ గ్రామాల్లో మహాధర్నాపై విస్తృత ప్రచారం నిర్వహించారు.

బ్యాక్‌లాగ్ పోస్టులపై నిశ్శబ్దం

ఉట్నూర్ ఐటీడీఏలో సుమారు 1000 బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. కానీ ఇంత వరకు ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6459 మంది టీటీసీ, బీఎడ్ శిక్షణ పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణత సాధించారు. ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనరల్ డీఎస్సీ భర్తీ కోసం గిరిజన పోస్టులు 70 కూడా లేకపోవడం గమనార్హం. 2012లో నిర్వహించిన ఏజెన్సీ డీఎస్సీ తర్వాత ఇంత వరకు డీఎస్సీ నిర్వహించ లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గిరిజన ఆశ్రమ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో వేలల్లో ఖాళీలు భర్తీకి నోచుకోవడం లేదు. 2005 నుంచి ప్రారంభమైన సీఆర్టీ వ్యవస్థతోనే కాలం గడుపుతున్నారు తప్ప డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న చిత్తశుద్ధి లేకపోవడంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. గడిచిన ఏడాది కాలంగా ఎక్కడికక్కడ నిరసనలు, ఉద్యమాలు చేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. కానీ అధికారులు వీరి వినతులను చెత్తబుట్టల్లో పడేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏళ్లకు ఏళ్లుగా కోచింగ్ కోసం లక్షల రూపాయలు వెచ్చించి చదివిన చదువుకు అర్థం లేకుండా పోతుందని జనరల్ డీఎస్సీలో ఏజెన్సీ పోస్టులు లేకపోవడంతో ఉద్యోగ అవకాశాలు తగ్గాయని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఐటీడీఏ డీఎస్సీపైనే ఆశలు పెట్టుకున్నట్లు వారు పేర్కొంటున్నారు.

ఏజెన్సీ చట్టాలు నిర్వీర్యం..

5వ షెడ్యూల్‌లో ఉన్న గిరిజన చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. భూబదాలయింపు చట్టం 1/70 ఏజెన్సీలో ఎక్కడా అమలు కావడం లేదు. పెసా చట్టాన్ని సైతం నిర్వీర్యం చేస్తున్నారు. చట్టాల ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. 317 జీవోతో ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు ఉద్యోగాల్లో చేరడంతో స్థానికులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఏజెన్సీ డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఆ మాట ఎత్తకపోవడం ఏంటని ఆదివాసీ నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ప్రధాన డిమాండ్లు

- ఐటీడీఏలో మెగా డీఎస్సీ నిర్వహించాలి.
- బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి.
- రైతులకు పోడు పట్టాలు ఇవ్వాలి.
- మరోసారి పోడు సర్వే చేయించాలి.
- జీవో నెంబర్ 3ను యథావిధిగా కొనసాగించాలి.
- ఏజెన్సీ పోస్టులను గిరిజనులతో భర్తీ చేయాలి.
- 1/70ని పకడ్బందీగా అమలు చేయాలి.
- పెసా చట్టాన్ని రక్షించాలి.

పట్టాలు ఇచ్చే వరకు పోరాటం



ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు నేటికీ పట్టాలు ఇవ్వలేదు. ప్రభుత్వం ఆదివాసీలకు పోడు పట్టాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తాం. ఆదివాసీ చట్టాలు, హక్కులను ఎక్కడికక్కడ నిర్వీర్యం చేస్తున్నారు. ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. హక్కుల రక్షణ కోసం రాష్ట్ర స్థాయిలో చర్చించి కార్యచరణ ప్రకటిస్తాం. – కొడప నగేశ్, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలి



2012 తర్వాత నేటి వరకు ఐటీడీఏ ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించలేదు. దీంతో నిరుద్యోగ సమస్య పెరుగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6వేలకు పైగా ఆదివాసీ నిరుద్యోగులు టీటీసీ, బీఈడీ శిక్షణ పూర్తి చేసి ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. గతంలో చాలా సార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించాలి. – పెందోర్ దీపక్, జైభారత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

పోడు పట్టాల కోసం నిరీక్షణ

ఏళ్లుగా పోడు భూములు సాగు చేస్తున్నప్పటికీ ఆదివాసీలకు పోడు పట్టాలు అందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 35 వేల హెక్టార్లలో సుమారు 12వేల మంది గిరిజన రైతులు పోడు భూములు సాగు చేస్తున్నారు. వీరికి పట్టాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ఉన్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని పోడు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరుద్యోగులతో కలిసి పోరుబాట పట్టారు.

ఐటీడీఏ ముట్టడి విజయవంతం చేయాలి

- తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: షెడ్యూల్ ప్రాంతంలో మెగా స్పెషల్ డీఎస్సీ నిర్వహించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతంలోని ఐటీడీఏ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్లతో సోమవారం తలపెట్టిన ఐటీడీఏ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కొమురంభీం కాలనీలో నిర్వహించిన సమావేశంలో సంఘ బాధ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. జీవో 3 ప్రకారమే బదిలీలు, పదోన్నతులను కల్పించాలని, పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీ రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, 5వషెడ్యూల్ ప్రాంతంలో జీవో 317 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆదివాసీ నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు మేధావులు, ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయిక సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ సంఘం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుంటే జూలై 3న డీఎంఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామనినారు. శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డులకు అందాల్సిన వేతనాలు కాంట్రాక్టర్లు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. జీవో నం.60 ప్రకారం కార్మికులకు రూ.15,600 చెల్లించాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు రూ.11వేలు మాత్రమే చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశానికి జిల్లా నాయకులు హాజరయ్యారు.

గుట్కాపై ఉక్కుపాదం

- ఆదిలాబాద్‌లో ఐదు గోదాములపై దాడులు
- రూ.77.60లక్షల విలువ చేసే గుట్కా స్వాధీనం
- ఐదుగురిపై కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న గుట్కా సంచులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్‌లో గుట్కాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎస్పీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని ఐదు గోదాముల్లో దాడులు నిర్వహించి రూ.లక్షల విలువచేసే గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు పట్టణంలోని ఓంకార్ జిన్నింగ్ మిల్లులోని నాలుగు గోదాముల్లో తనిఖీ చేయగా రూ.50,16,942 విలువ గల దాదాపు 20 రకాల నిషేధిత గుట్కా లభించడంతో నలుగురిపై కేసు నమోదు చేశారు. రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని చాందా సమీపంలో గల గోదాములో తనిఖీ చేయగా రూ.27,43,644 విలువ చేసే గుట్కా లభించగా ఒకరిపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేయగా ముగ్గురు పరారీలో ఉన్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సాజిదుల్లా ఖాన్, అస్లమ్ ఖాన్, సమీఉల్లా ఖాన్, ఫసీఉల్లా ఖాన్‌లపై వన్‌టౌన్‌లో, అర్బాజ్ అలీపై రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ నిషేధిత గుట్కాను అమ్మినా, రవాణ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు సత్యనారాయణ, అశోక్, రమాకాంత్, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'కడెం'కు స్వల్ప ఇన్‌ఫ్లో



కడెం: కడెం ప్రాజెక్టులోకి ఆదివారం 2,970 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 (7.603 టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 673.200 (2.564టీఎంసీ) అడుగుల నీరుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నేరడిగొండ: మండలంలోని కుప్టీ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీను అతని కుటుంబసభ్యులతో కలిసినాటు వైద్యం కోసం ఇచ్చోడ మండలానికి వచ్చాడు. గుమ్మడి శ్రీనుతో పాటు అతని భార్య ఒకబైక్‌పై, కుమారుడు కృష్ణ మరో బైక్‌పై వస్తుండగా, కుప్టి జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు కృష్ణ బైక్‌ను ఢీకొట్టింది. వెంటనే 108కు సమాచారం ఇచ్చి నిర్మల్‌లోని ఆసుపత్రికి తరలించారు. కృష్ణ తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

తాంసి(బోథ్): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని పాలోది గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పాలోది గ్రామానికి చెందిన మానిక్‌రావు అనే వ్యక్తి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పంట చేనులో పనులకు వెళ్లిన ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే సమీపంలోని పంటచేనులో ఉన్న కూలీలు, రైతులు గమనించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈఎంటీ కార్తీక్ అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి మానిక్‌రావును రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని వేణునగర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మడావి దిందార్షా (56) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మండలంలోని గొట్టి గ్రామం పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత మూడు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ దిందార్షా ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



మృతి చెందిన గేదె

నేరడిగొండ: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు జాదవ్ జవహర్‌లాల్‌కు చెందిన గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. మేత మేసేందుకు బయటకు వెళ్లిన గేదె తెగి పడి ఉన్న విద్యుత్ తీగలను తాకడంతో కరెంట్ షాక్ తగిలింది. గేదె విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని రైతు పేర్కొన్నాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరాడు.

అంధకారంలో జిల్లా జనరల్ ఆస్పత్రి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఆదివారం అంధకారం అలుముకుంది. దాదాపు 6 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచింది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. వైద్యులు టార్చ్‌లైట్ వెలుగులో రోగులకు సేవలందించారు. 6 గంటల తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కావడంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

నిర్మల్‌టౌన్: నిర్మల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఐజాజ్‌ను సస్పెండ్ చేస్తూ ఆదివారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన సమయంలో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేశారన్న కారణంగా విచారణ చేపట్టి అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు.

రైఫిల్ షూటింగ్‌లో సిల్వర్ మెడల్



మెడల్ అందుకుంటున్న మహతి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌కు చెందిన వెరబెల్లి రవీందర్‌రావు– ఉమాదేవిల కూతురు మహతి ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన 10 మీటర్ల రైఫిల్ షూటింగ్ జూనియర్ మహిళా, జూనియర్ విభాగాల్లో రెండోస్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. రాష్ట్రస్థాయిలో రాణించిన మహతికి రాష్ట్ర మాజీ డీజీపీ అంజనీకుమార్ మెడల్ అందించారు. మహతి ప్రస్తుతం పూణేలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటుంది.

నీరు నిలిచే... ఇబ్బందులు తెచ్చే!



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో చిన్నపాటి వర్షానికే రోడ్డుపై మురుగునీరు నిలుస్తోంది. నీరు ప్రవహించే మార్గం లేకపోవడంతో రోడ్డుపైనే నీరు నిలిచిపోతోంది. తద్వారా దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ట్రిపుల్‌ఐటీకి 15వేలకుపైగా దరఖాస్తులు



బాసర ట్రిపుల్‌ఐటీ

- గతేడాదితో పోలిస్తే సగానికి తగ్గుదల
- ఈ నెలాఖరు వరకు పరిశీలన పూర్తి
- జూలై 3న ఎంపిక జాబితా వెల్లడి
- 8, 9, 10 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన

భైంసా: 2024–25 విద్యాసంవత్సరానికి బాసర ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశానికి జూన్ 1నుంచి 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. కళాశాలలో 1,500 సీట్లుండగా రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి 15వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు కళాశాల అధికారులు తెలిపారు. దరఖాస్తుల కచ్చిత సమాచారం త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు.

పరిశీలించాకే ఎంపిక జాబితా

ఈనెలాఖరు వరకు దరఖాస్తులను పరిశీలించి ఎంపిక జాబితాను జూలై 3న ప్రకటిస్తామని ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్లను జూలై 8,9,10 తేదీల్లో పరిశీలించి సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

కోర్సు ఇలా..

ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో భాగంగా మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ తరగతులు బోధిస్తారు. పీయూసీలో వచ్చిన మెరిట్ ఆధారంగా నాలుగేళ్ల బీటెక్ కోర్సులో వివిధ బ్రాంచ్‌లలో సీట్లు కేటాయిస్తారు. విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుంది. యూనిఫాంలు, షూస్, ల్యాప్‌టాప్ ఇస్తారు. విద్యార్థులు ఆటలు, కళలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేలా శిక్షణ ఇస్తారు. కళాశాలలో ప్రత్యేక వైద్యశాల, అధునాతన ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి.

సగానికి తగ్గిన దరఖాస్తులు

2020–21 విద్యాసంవత్సరంలో 32వేల మంది, 2021–22లో 20,178, 2022–23లో 31,432 మంది, 2023–24 విద్యాసంవత్సరంలో 32,635 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాదితో పోలిస్తే దరఖాస్తుల సంఖ్య సగానికి తగ్గింది.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: అంతర్జాతీయ ఒలింపిక్ డే పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి పరుగులో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత క్రీడాకారులు అంతర్జాతీయ వేదికల్లో గొప్ప ప్రదర్శన ఇస్తున్నారన్నారు. జిల్లాలో ఎంతో మంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారని, వారు ఒలింపిక్ వంటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించేలా క్రీడా సదుపాయాలు మెరుగుపరచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ సహకారంతో జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు సన్మానం..

జిల్లాలో పదోన్నతి పొందిన పలువురు వ్యాయామ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లోని క్రీడా సామర్థ్యాలను గుర్తించడంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.స్వామి, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర పాల్, క్రీడా సంఘాల బాధ్యులు హరిచరణ్, రవికుమార్, నాందేవ్ జ్యోతిశ్వరన్, వీరేశ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

లైవ్ మండల కోఆర్డినేటర్‌గా రాథోడ్ సందీప్ నాయక్


రాథోడ్ సందీప్ నాయక్

నేరడిగొండ: లంబాడాల ఐక్యవేదిక (లైవ్) మండల కోఆర్డినేటర్‌గా రాథోడ్ సందీప్ నాయక్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టడంపై సంతోషం వ్యక్తం చేశారు. మండల పరిధిలో లంబాడాల ఐక్యత కోసం తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన లంబాడాలకు కృతజ్ఞతలు తెలిపారు.

ధర్నా విజయవంతం చేయండి

తలమడుగు: ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తుడుందెబ్బ కమిటీ పిలుపు మేరకు ఈనెల 24న ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా చేపడుతున్నట్లు మండల అధ్యక్షుడు పోచ్చన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజనులతో కలిసి సమావేశం నిర్వహించారు. ధర్నాకు పెద్దఎత్తున రావాలని పిలుపునిచ్చారు. జీవో 3ను యథా విధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు భుజంగ్‌రావు, ఆదివాసీ సంఘం నాయకులు ఈశ్వర్, పోచ్చన్న, అశోక్, రాము పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేయాలి

నేరడిగొండ: మండలంలోని బోథ్ ఎక్స్‌రోడ్డులో హైమాస్ట్ లైట్లు పనిచేయకపోవడంతో ఆ ప్రాంతంలో అంధకారం నెలకొంది. బోథ్ ఎక్స్‌రోడ్డు నుంచి అంతర్ రాష్ట్రీయ రహదారి ఉండడంతో ఆ దారిగుండా ప్రయాణికులు వస్తుంటారు. చిమ్మచీకటి నెలకొనడంతో భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హైమాస్ట్ లైట్లు వెలిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి కోసం తండ్లాట


ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

ఇంద్రవెల్లి: భారీ వర్షల కారణంగా కుమురం భీం జిల్లా ఆడ ప్రాజెక్టులో వరద నీరు చేరి కాలుషితం కావడంతో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాను అధికారులు నిలిపి వేశారు. దీంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సమీపంలోని బావులు, వ్యవసాయ బోర్లు నుంచి నీటిని తీసుకువచ్చి వినియోగిస్తున్నారు. నీటి సమస్యను గుర్తించి పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

కూలిన లోలెవల్ వంతెన


కూలిన వంతెన

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీ వాగుపై ఉన్న లోలెవల్ వంతెన కూలిపోయింది. గత పదేళ్ల క్రితం నిర్మించిన వంతెనను గుత్తేదారు నాసిరకంగా నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. దీంతో వంతెనపై నుంచి రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. వరద నీరు కాలనీలోకి వచ్చే అవకాశం ఉంది. నూతన వంతెనను నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్ సత్యసాయి మందిరంలో ఆదివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో హోమియో క్లినిక్ నిర్వహించారు. ప్రతీ ఆదివారం, గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రోగులకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులరు పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్యులు ప్రసాద్, అక్షయ్ వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు.

కలగానే టూరిజం!


కనువిందు చేస్తున్న మత్తడి చెరువు అందాలు

- మత్తడి చెరువుపై దృష్టి సారించని అధికారులు
- గతంలో మత్తడి సందర్శించిన జిల్లా కలెక్టర్, టూరిజం అధికారులు

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీలో పేరుగాంచిన మత్తడి చెరువు పర్యాటకుల మదిని దోచుకుంటున్నా.. నిర్లక్ష్యానికి గురవుతోంది. ప్రతీ ఏడాది పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తున్నప్పటికీ సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఏజెన్సీ డివిజన్ కేంద్రం లక్కారం పరిధిలో వచ్చే ఈఅందాల చెరువు అందరి మదిని దోచుకుంటోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అడవి చెంతన ఉన్న చెరువు పర్యాటకులను కనువిందు చేస్తోంది. లక్కారం నుంచి 3 కిలో మీటర్లు వెళ్తే ఈ అందమైన చెరువు దృశ్యాలను చూడవచ్చు. కానీ గత కొన్ని సంవత్సరాల క్రితం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని అధికారులు సైతం పర్యటించారు. అయితే అప్పట్లో నిర్లక్ష్యానికి గురి కాగా.. ప్రస్తుతం స్వరాష్ట్రంలో కూడా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఉట్నూర్ డివిజన్ పరిధిలో ఇక్కడి ప్రజలకు ఇలాంటి అందమైన ప్రదేశాలు ఎక్కడ లేకపోవడంతో పర్యాటకుల సేద తీర్చుకోవడానికి ఇక్కడికి రావాల్సిందే. సెలవు రోజుల్లో పాఠశాల విద్యార్థులు వారి తల్లి దండ్రులతో కలిసి సందర్శిస్తారు. ఈ చెరువు వద్దకు రావాలంటే బురద రోడ్డే దిక్కు. పర్యాటకులు అధికంగా వస్తున్నప్పటికీ అధికారులు వసతులు మాత్రం కల్పించడం లేదు.

ఆహ్లాదకర వాతావరణం..

మండలంలోని లక్కారం పంచాయతీ పరిధిలో గల ఈమత్తడి చెరువు సందర్శకుల మదిని దోచుకుంటోంది.. విశాలమైన చెరువు.. చుట్టూ కొండలు మత్తడి నుంచి పారుతున్న నీటి పరవళ్లకు ప్రసిద్ధి. ప్రతీ ఏటా కురుస్తున్న వర్షాలతో చెరువు కనువిందు చేస్తోంది. ఎత్తైన కొండల నుంచి నీరు చెరువలో చేరి, మత్తడి నుంచి జాలు వరడంతో పర్యాటకులు చూసేందుకు వస్తుంటారు. అయితే లక్కారం నుంచి మూడు కిలో మీటర్లు దూరంలో ఉన్న చెరువుకు చేరుకోవాలంటే సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అప్పటి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, టూరిజం అధికారులు పర్యటించారు. అయినా.. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఏజెన్సీలోనే డివిజన్ కేంద్రంలో అందుబాటులో చెరువును అభివృద్ధి చేస్తే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందిచవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మత్తడి చెరువును అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి చేయాలి



మత్తడి చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. అప్పటి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు మత్తడి చెరువును టూరిజం కేంద్రంగా ఏర్పాటు చేస్తామని పరిశీలించడం జరిగింది. అదే విధంగా టూరిజం అధికారులు సైతం నివేదికలు తయారు చేశారు. అయినా నేటి వరకు ఈ చెరువుపై దృష్టి సారించడం లేదు.

– పుర్కు బాపురావు, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి

గిరిజనులకు లబ్ధి



మత్తడి చెరువును టూరిజం కేంద్రంగా ఏర్పాటు చేస్తే ఇక్కడి గిరిజనులకు ఉపాధి దొరుకుతుంది. డివిజన్ కేంద్రంలో కాలక్షేపం కోసం ఇలాంటి ప్రదేశాలు ఎక్కడ లేక పోవడంతో ప్రజలు ఎక్కువ ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడి వాతావరణం ప్రదేశాలు కూడా చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. చెరువును అభివృద్ధి చేసి, చెరువు కట్ట సామర్థ్యాన్ని పెంచాలి.

– మర్సుకోల తిరుపతి, మాజీ సర్పంచ్, లక్కారం

గ్రామదేవతలకు పూజలు


ఇచ్చోడ: పూజలు చేస్తున్న గ్రామస్తులు


తాంసి: పూజలు చేస్తున్న ముదిరాజ్‌లు

ఇచ్చోడ: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటల బాగా పండాలని ముఖరా(బి)లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతలతో పాటుగా ఊరి పొలిమేరలో ఉన్న దేవతలకు జలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పటేల్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అడవ్ మారుతి, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న దేవుడి పండుగ

తాంసి: ప్రతీ ఏటా వర్షాకాలం సీజన్‌లో నిర్వహించే భీమన్న దేవుడి పండుగను ఆదివారం తాంసి మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తులు ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పులతో గ్రామశివారులో ఉన్న భీమన్న దేవుడి వద్దకు వెళ్లి పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలు పండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పొచ్చన్న, యువజన విభాగం అధ్యక్షుడు రాఘవేంద్ర, పెద్దలు జీవన్, రమాకాంత్, శ్రీకాంత్, సాయి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు

- మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్

ఆదిలాబాద్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపాల్టీ తరపున పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆయన పట్టణంలోని సంజయ్‌నగర్, పోలీస్‌కాలనీల్లో పర్యటించారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా ఉండేలా మున్సిపల్ సిబ్బందిచే ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపడుతున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. చెత్త చెదారాన్ని రోడ్లపై వేయకుండా మున్సిపల్ చెత్త వాహనాలకు అందించాలన్నారు.

అధిక ధరలకు పుస్తకాలు విక్రయం

బోథ్: పాఠశాలల్లో అధిక ధరలకు పుస్తకాలను అంటగడుతున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పాఠశాల నిర్వాహకులు తమ పంథా మార్చారు. మండలంలోని పొచ్చెర క్రాస్‌రోడ్డు వద్ద గల ఓ పాఠశాల నిర్వాహకులు తమ పుస్తకాలను మండల కేంద్రంలోని ఓ పుస్తక దుకాణం ద్వారా విక్రయిస్తున్నారు. పుస్తక యాజమానికి కొంత కమీషన్ తీసుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సదరు పుస్తక దుకాణంలో విద్యార్థులు డబ్బులు చెల్లించి పుస్తకాలను తీసుకోవాలని యాజమాన్యం సూచిస్తుంది. పాఠశాల యాజమాన్యంతో పాటు సదరు పుస్తక యజమానిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

జవాను కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

సిరికొండ: ఇటీవలే ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన జవాను సూర్యవంశీ రాజేశ్వర్ కుటుంబాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం పరామర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగఢ సానుభూతి తెలిపారు. జవాన్ చిత్రపటానికి నివాళులర్పి ంచారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని ముఖరా(కె)లో బీఆర్‌ఎస్ కార్యకర్త కాంబ్లే వినోద్ సోదరి అర్చిక ఇటీవల మృతి చెందడంతో ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యకర్తలు ఎవరూ అధైర పడవద్దన్నారు. ఆయన వెంట ముఖార(బి) ఎంపీటీసీ గాడ్గే సుభాష్, మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, పాండరంగ్, మహేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, గులాబ్, కరణ్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఆడే గజేందర్


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆడే గజేందర్

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి సీతక్క, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి బోథ్ నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని అటవీ భూముల సమస్యతో పాటు కుప్టి ప్రాజెక్ట్, తదితర అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం త్వరలో నియోజకవర్గంలోని సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సిరికొండ: మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థినులతో మాట్లాడుతూ.. సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యరాణి పాఠశాలకు ప్రహరీ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో అతి త్వరలో ప్రహరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అంకిత భావంతో పని చేసి, విద్యార్థినులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.

బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల నిర్వహణ


పరీక్షలకు హాజరైన తైక్వాండో క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సాహా తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి రవికుమార్ హాజరయ్యారు. చిన్నారులు ఆత్మరక్షణ విద్యలను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, క్లబ్ నిర్వాహకుడు వీరేష్, షూటింగ్ బాల్ కార్యదర్శి హరిచరణ్ ఉన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్


బేల: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


నేరడిగొండ: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: భారతీయ రాజకీయ చరిత్రలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాశ్మీర్ విషయంలో ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంజ్ బ్రహ్మానంద్, ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, లాలామున్న, భీమ్ సేన్‌రెడ్డి, వేదవ్యాస్, శివ, విజయ్, భూమేష్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: జన్ సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను మండల బీజేపీ నాయకులు ఆదివారం మండల కేంద్రంలోని పులాజీబాబా కళాశాలలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రాథోడ్ రితేశ్, రమేశ్, కొలిపాక రాజశేఖర్, వెంకటేశ్, రవీందర్, రాజేశ్వర్, శ్రీకాంత్, సతీశ్, దేవిదాస్ పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని దేవాపూర్‌లో ఆదివారం అఖండ భారతవని కోసం ప్రాణాలర్పించిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు కిరణ్, శ్రీనివాస్, రాజు, శేఖర్, రాములు, ఆశన్న, తదిత రులు పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు దత్తా నిక్కమ్, రామెల్లి మోరేశ్వర్, బోనిగిరివార్ గణేష్, ఠాక్రే సందీప్, ధర్నే జీవన్, నవీన్, తరుణ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: దేశ విభజన, బెంగాళ్ విభజనతో పాటు కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి హోదా కల్పించే ఆర్టికల్ 370ను డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారని బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒకే ప్రధాని, ఒకే రాజ్యాంగాన్ని ప్రధాని మోదీ అమలు చేస్తున్నారని, ఆర్టికల్ 370 జీవోను రద్దు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధర్మపురి రాఘవులు, బంటు ప్రవీణ్, భీంరావ్, దేవ్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

ఎదులాపురం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రదేవేందర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా అంగన్‌వాడీలను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. తక్షణమే రూ.18 వేల వేతనం చెల్లించాలని, సమ్మె కాలపు వేతనాలు, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు.

పరామర్శ

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) మాజీ ఎంపీటీసీ గొల్లి రామయ్య గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని అర్లి(టి)లో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఆదివారం పరామర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

తాంసి: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ ప్రకటించడంతో భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామంలో ఆదివారం రైతులు, కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఏకకాలంలో రుణమాఫీతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేవారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నారాయణ, శ్రీనివాస్, రాజు, తదితరులరు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో..

ఆదిలాబాద్‌టౌన్: దశాబ్ద కాలం నుంచి నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియను చేపట్టడంపై పీఆర్టీయూ తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్‌సింగ్, నర్ర నవీన్ యాదవ్‌లు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా బదిలీ, పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం తీపి కబురు అందించిందన్నారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు బాబన్న, జాదవ్ ప్రకాష్, మోహన్, దినేష్, అంబాజీ, పొచ్చన్న, సంతోష్ పాల్గొన్నారు.

రుణమాఫీ ప్రకటనపై సంబురాలు

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏక కాలంలోనే రెండు లక్షల రుణమాఫీ చేయనుండడంతో అన్నదాత ముఖాల్లో ఆనందం కనిపిస్తోందని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. ఆదివారం మండలంలోని తేజాపూర్ ఆదివాసీ రైతులతో కలిసి సంబురాలు జరుపుకున్నారు. వ్యవసాయ పొలంలో విత్తనాలు విత్తి స్వీట్లు పంచిపెట్టారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే ఉద్దేశ్యంతోనే ఇటువంటి చరిత్రాత్మక నిర్ణయం కాంగ్రెస్ తీసుకుందన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ గోవింద్ రావు, సుదర్శన్, విశాల్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

హామీలు నెరవేర్చాలి

బోథ్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్‌ఎస్ బోథ్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకే దిక్కు లేదన్నారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామని కాంగ్రెస్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

సహకరించడం అభినందనీయం

నేరడగొండ: మండల కేంద్రంలో ఇటీవల జరిగిన నేరడిగొండ ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) విజయవంతం చేయడానికి సహకరించడం అభినందనీయమని ఎన్‌సీసీ సభ్యులు జాదవ్ పవన్ కుమార్, యోగి, దినేష్‌లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నేరడిగొండ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ యువ నాయకుడు రాథోడ్ సురేందర్‌లను శాలువాతో సత్కరించారు.

ఎస్సైకి సన్మానం

తాంసి: తాంసి ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న బాధావత్ శివరాంను తాంసి మాజీ సర్పంచ్ కృష్ణ, నాయకులు శాలువాతో సన్మానించారు. జిల్లాస్థాయిలో ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికైనా ఎస్సై శివరాంను ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. మండల కాంగ్రెస్ నాయకుడు రామన్న యాదవ్, దేవారెడ్డి ఉన్నారు.

భగీరథ నీటినే తాగాలి


బావి నీటిని పరీక్షిస్తున్న నాయకులు

బేల: బావి నీటిని తాగితే అనారోగ్యం బారిన పడుతామని, ప్రతీరోజు మిషన్ భగీరథ నీటిని తాగాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్ అన్నారు. ఆదివారం మండలంలోని సదల్‌పూర్ గ్రామాన్ని సందర్శించారు. స్థానికంగా ఉన్న బావుల నీటిని పరిశీలించారు. బావి నీళ్ల త్రాగితే ప్రమాదకరమని వివరించారు. భగీరథ నీటిని కూడా వేడి చేసి చల్లార్చి తాగాలని సూచించారు. నాయకులు ఉరాది దేవేందర్, బోయర్ నరేందర్, గణపతివార్ వెంకట్‌రాజు, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.